కవితా కౌముది

## ఉత్తిష్ఠ నరశార్దూల !!

డా.అయ్యగారి లక్ష్మణరావు

అదీ ఇదీ అన్నది
ఉన్న నిజం కాదది
అదే ఇది ఇదే అది
ఉన్న నిజం అదే మరి

ఆది ఉన్న ప్రతీదీ
అంతానికి చేరుతుంది
ఆది లేక అంతమవని
ఉన్న నిజం నీవే కదా !
వేదాంతం వింత తీరు !!

ఎంత నువ్వు అనుకున్నా
ఉన్నాయని అనుకున్నవి
ఊడిపోక ఉంటాయా
వాటితోటి ముడిపడడం
బాధ యొక్క తొలి మూలం
అనుకోడం మానెయ్యడం
మోక్షానికి తొలి మార్గం

నీ తృప్తికి అడ్డంగా
నిలిచి వున్న వెన్నెన్నో
విరామమే లేకుండ
ఆది నుంచి తుది దాకా
పరీక్షించి చూడు చూడు
వయసు బట్టి మారిపోవు
వికసించని ఆశ లెన్నో

కన్నవారి ప్రవర్తనే
కొంతమంది ఆవేదన
పొందు రాని అందాలే
వయసు లోని రగులు భగులు
జరా మరణ దుఃఖాలే
ముసలితనపు ముచ్చట్లు

లేనిదేది ఏదైనా రాలేదని
చంపు చింత
ఎంతమందికుంటుంది
ఇంతేనా జీవితం
సంసారపు సాగరం ???

★★★

# చేజారిన పెన్నిధి

బారు శ్రీనివాసరావు

విశ్వరహస్యాల ముడి విప్పే పయనం
పరుల అనుభవం నీకు నేర్పించే పాఠం
చరిత్ర సత్యాలను వెలికితీసే ప్రయత్నం
స్పష్టంగా నిన్ను నీకు చూపించే అద్దం
పుస్తక పఠనం నేడు తెరమరుగైపోయింది

అజ్ఞాత ప్రేమికుని అసంపూర్తి లేఖలు
మధ్యలో దాగిన గుల్మోహర్ ఊసులు
కథలు,గాథలు, కాలాతీత వ్యథలు,
సూత్రాలు, సత్యాలు, చిత్రాలవంటి కావ్యాలు
విడమరిచే పఠనం కనుమరుగైపోయింది

తలపొగరుతో పరిధులు దాటేసేదొకటి
ప్రశ్నలతో నిండిన ప్రహేళిక మరొకటి
పొరపాటున వరుస తప్పి వెక్కిరించేదొకటి
తర్జుమా ప్రయాసలో తలక్రిందులయేదొకటి
పేరంటపు పడుచుపిల్లలా నాడు పుస్తకం ఎదురొచ్చేది

ముఖానికి తాకితే అమ్మ చేతి చలువ
గుండెపై వాలితే శిశిరంలో కలువ
ఆత్మీయతతో అల్లాడితే ఊతమిచ్చే హస్తం
వేలుపట్టి నడిచొచ్చే చిన్ననాటి నేస్తం
అంత మంచి పుస్తకాన్ని నేడు అంతర్జాలం మింగేసింది

★★★

# చిగురించిన సత్యాన్ని

శ్రీ సాహితి

ఒక్కో అక్షరం
ఓక్కో సైనికుడిలా
రాత్రి చుట్టూ కాపలా

ఏ క్షణం తప్పించుకుని
పగటి మోసానికి
బలి కాకుండా

నగ్నంగా
నిజం మాట్లాడే
అర్ధరాత్రి పలుచన కాకుండా

మాట చప్పుడుకి
ఆలోచన ఒలికి పోకుండా
ఒడిసి పట్టుకుని

ఏకాంత స్పర్శకు
చిగురించిన సత్యాన్ని
గర్భం దాల్చిన రాత్రి

రంగు, రుచి, వాసన లేని
పదాలుకి జన్మనిచ్చి
స్వచ్ఛమైన అర్థాన్ని పెంచింది.

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

అందరును వీడి యొంటరివైన యపుడు
అన్ని చింతలు శిఖరమ్ములైన యపుడు
దారి తెలియక హృదయమ్ము తల్లడిల్లి
వెతల భారముతో దురపిల్లునపుడు

అనుదినమ్మును దుర్భరమైన గాని
వేచియున్నది యానందవీచి యెచటొ
కరగిపోవును కష్టశిఖరములన్ని
ప్రస్ఫుటమ్మగునానందపథము మనకు

ఎంతగా మది క్రుంగిపోయినను గాని
తిరిగి మేల్కొని కోల్కొని యరుగవలయు
ఎచటనుండియో శక్తి నీ యెదను చేరు
నడచిపోదువు మబ్బు దొంతరలపైన

మోదమైనను వేధించు ఖేదమైన
చిరము మనతోడనుండదు జీవితమున
స్వాగతమ్ములు మనసార పలుకగలము
వలదు వలదంచు సాగనంపంగ గలమె!

దినమునందున ధారుణి తేజరిల్లు
యామవతియందు సర్వమ్మునాంధ్యమయము
దుఃఖమే లేక సౌఖ్యమ్ము దొరకునెట్లు?
సౌఖ్యమునకొకపరియు విశ్రాంతి వలదె?

COMMENTS